ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 62 మంగళవారం 04, నవంబర్ 2025 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# తేమ పేరుతో పత్తి రైతులను దోచుకుంటున్నారు

**సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కవిత ఆగ్రహం**
**సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం ఆపి రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు**
**తేమతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధరకు పత్తి కొనాలని డిమాండ్**



02

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, తేమ పేరుతో కొనుగోలు కేంద్రాల్లో వారిని దారుణంగా మోసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాల్లో అధికారులు సృష్టిస్తున్న ఇబ్బందుల వల్ల రైతులు గిట్టుబాటు ధర కోల్పోయి, ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఆమె జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'తేమ సాకుతో సీసీఐ అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో దిక్కు లేక రైతులు తమ పంటను ..మిగతా 2లో

# ఒక్క క్షణం ఏం జరుగుతుందో అర్థం కాలేదు..

**చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర లోడుతో వెళుతున్న లారీ**
**ప్రమాదంలో స్వల్ప గాయాలతో తృటిలో తప్పించుకున్న కండక్టర్**
**బస్సులో పోలీసులు, ఉద్యోగులు సహా 72 మంది ప్రయాణికులు**



02



# ఘోర రోడ్డు ప్రమాదం

**బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

## రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆర్టీసీ బస్సును ఢీకొని, మీద పడిన కంకర లారీ**
**ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి**
**మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లతో పాటు మహిళలు, చిన్నారి**
**ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు, ముగ్గురి పరిస్థితి విషమం**

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

రంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన లారీ, బస్సుపై బోల్తా పడింది. లారీలోని కంకర మొత్తం ప్రయాణికులపై ..మిగతా 2లో

# రంగారెడ్డి ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

**సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశం**
**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన**
**గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులు**
**ప్రమాదంపై మంత్రి పొన్నం, ఏపీ నేతలు పవన్, లోకేశ్ స్పందన**
**మృతుల కుటుంబాలకు పవన్ కల్యాణ్, నారా లోకేశ్ సానుభూతి**



02



## ఘోర బస్సు ప్రమాదంపై కేసీఆర్, కేటీఆర్ స్పందన

**ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొని 19 మంది మృతి**
**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కేసీఆర్, కేటీఆర్**
**బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**
**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్**

02

# ఈ వారం రోజులు చాలా కీలకమైన సమయం..

**జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం**
**ఏ ఒక్క నాయకులు కూడా ఎలాంటి నిర్లక్ష్యం వద్దు**
**ఎన్నికల వ్యూహాలు పకడ్బందీగా ఉండాలి : టీపీసీసీ మహేశ్ గౌడ్**



తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో ఆయన సమావేశమై, ఎన్నికల వ్యూహాలపై కీలక సూచనలు చేశారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "ఇది చాలా కీలకమైన సమయం. ఈ వారం రోజులు ఎన్నికల ఫలితాలను నిర్ణయించే రోజులు. ..మిగతా 2లో

# రేవంత్ రెడ్డీ, నువ్వెంత..

## మాగంటి సునీతకు మేం అండగా ఉన్నాం

**బోరబండలో కేటీఆర్ రోడ్డు షో**
**సునీతకు కేసీఆర్, కేటీఆర్, విష్ణు అండగా ఉన్నారని వ్యాఖ్య**
**కాంగ్రెస్ గూండాగిరి చేస్తే అరగంటలో మీ ముందు ఉంటామని హామీ**



తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

"హిట్లర్ వంటి పెద్ద పెద్దవారే చరిత్రలో కలిసిపోయారు, ఇక నువ్వెంత రేవంత్ రెడ్డి, నీ బ్రతుకెంత!" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండలో రోడ్ షో నిర్వహించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లికి వచ్చిన బుల్డోజర్ రేపు జూబ్లీహిల్స్‌కు రాకుండా ఉండాలంటే మాగంటి సునీతను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. మాగంటి సునీత ఒక ఆడపిల్ల అని, ఆమె కష్టమొచ్చి చెప్పుకుంటే, బయటకు వస్తుందా అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారని, కానీ ఆమెకు తామంతా అండగా ..మిగతా 2లో



## మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

**రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం**
**ఈ దుర్ఘటనలో 24 మంది దుర్మరణం**
**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం**
**గాయపడిన వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం**
**ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన**

02

## తేమ పేరుతో పత్తి రైతులను
# దోచుకుంటున్నారు

**మొదటిపేజీ తరువాయి**

ప్రైవేటుకు అమ్ముకుంటున్నారు. ఈ ప్రాంతంలో బీజేపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది" అని విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లో ప్రచారం ఆపి, తక్షణమే రైతుల సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తిని గిట్టుబాటు ధరకు సీసీఐ కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అంతకుముందు ఆదిలాబాద్‌కు చేరుకున్న కవితకు తెలంగాణ జాగృతి నాయకులు, ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలు, సంప్రదాయ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక రైతులు, ఆదివాసీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



## ఈ వారం రోజులు చాలా
# కీలకమైన సమయం..

**మొదటిపేజీ తరువాయి**

ప్రతి నాయకుడు తన బాధ్యతను పూర్తిగా నిర్వర్తించాలి. చిన్న నిర్లక్ష్యం కూడా చేయకూడదు," అని స్పష్టం చేశారు. రెండు సంవత్సరాలుగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. "మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తే, మన విజయాన్ని ఎవరూ ఆపలేరు," అని ఆయన అన్నారు. అలాగే, ఇంటింటి ప్రచారం, వీధి స్థాయి ప్రచారంలో పార్టీ నాయకులు మరింత చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. "మీరందరూ అనుభవజ్ఞులైన నాయకులు. ప్రజలను కాంగ్రెస్ వైపు ఎలా నడిపించాలో మీకు బాగా తెలుసు. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అభ్యర్థిలా పని చేయాలి. ఫలితం మనకు అనుకూలంగానే వస్తుంది, మంచి మెజారిటీతో గెలుస్తాం," అని మహేశ్ గౌడ్ విశ్వాసం వ్యక్తం చేశారు.



# రేవంత్ రెడ్డీ, నువ్వెంత..
## మాగంటి సునీతకు మేం అండగా ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్, విష్ణువర్ధన్ రెడ్డి, తాను ఆమెకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. పక్కనే తెలంగాణ భవన్ ఉందని, అర్ధరాత్రి ఫోన్ చేసినా అర్ధగంటలో మీ ముందు ఉంటామని, కాంగ్రెస్ నాయకులు వచ్చి గూండాగిరి చేస్తే గల్లా పట్టి నిలదీస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఓటు వేయకుంటే పథకాలు రద్దు చేస్తామని రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని, అది రేవంత్ రెడ్డి సొంత డబ్బుతో ఇస్తున్నారా అని ప్రశ్నించారు. హైడ్రా బాధితులను చూస్తే ప్రతి ఒక్కరి కళ్ల వెంట నీళ్లు వస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో వేలాది మంది పేదల ఇళ్లను కూల్చివేశారని ఆయన మండిపడ్డారు. హైడ్రా అనే రాక్షసి మాయం కావాలంటే కారు గుర్తుకు ఓటేసి సునీతను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కేసీఆర్ తిరిగి ఈ రాష్ట్రానికి నాయకత్వం వహించాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరిని కూడా మోసం చేయకుండా విడిచిపెట్టదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ హామీలు ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇంకా అమలు చేయడం లేదని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకు పేదల ఇళ్లు కూలగొట్టారని ఆయన ఆరోపించారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

పడటంతో చాలా మంది దాని కింద చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి, తిరిగి హైదరాబాద్‌లోని కార్యాలయాలు, కళాశాలలకు వెళ్తున్న వారే వీరిలో అధికంగా ఉన్నారు. ప్రయాణికుల ఆర్తనాదాలతో ప్రమాద స్థలం హృదయవిదారకంగా మారింది.

మృతుల్లో బస్సు డ్రైవర్ దస్తగిరి, లారీ డ్రైవర్ సహా 12 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూడు జేసీబీల సహాయంతో కంకరను తొలగించి, అందులో చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు కండక్టర్ రాధ సహా 15 మందిని సురక్షితంగా కాపాడారు. ఈ క్రమంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ కూడా గాయపడ్డారు.

క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్షతగాత్రులకు అత్యున్నత వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల కోసం గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. మృతులందరి పోస్టుమార్టం ఉస్మానియా ఆసుపత్రిలో ఒకేచోట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా హైదరాబాద్‌బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.



## రంగారెడ్డి ప్రమాదంపై
# సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

- **సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశం**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన**
- **గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులు**
- **ప్రమాదంపై మంత్రి పొన్నం, ఏపీ నేతలు పవన్, లోకేశ్ స్పందన**
- **మృతుల కుటుంబాలకు పవన్ కల్యాణ్, నారా లోకేశ్ సానుభూతి**

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

రంగారెడ్డి జిల్లాలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలియగానే ఆయన తక్షణమే స్పందించి, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఉన్నతాధికారులను సూచించారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యమని సీఎం స్పష్టం చేశారు. గాయపడిన వారిని వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించి, అత్యుత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలను ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని కోరారు. బాధితుల కోసం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పరిస్థితి విషమంగా ఉన్న వారిని కాపాడేందుకు నిపుణులైన వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనను ఒక 'హెల్త్ ఎమర్జెన్సీ' తరహాలో పరిగణించి, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన వెంటనే ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకోవాలని ఆదేశించారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని పవన్ కల్యాణ్ కోరారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు నారా లోకేశ్ పేర్కొన్నారు.



## ఒక్క క్షణం ఏం జరుగుతుందో
# అర్థం కాలేదు..

- **చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర లోడుతో వెళుతున్న లారీ**
- **ప్రమాదంలో స్వల్ప గాయాలతో తృటిలో తప్పించుకున్న కండక్టర్**
- **బస్సులో పోలీసులు, ఉద్యోగులు సహా 72 మంది ప్రయాణికులు**
- **చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర లోడుతో వెళుతున్న లారీ**
- **ప్రమాదంలో స్వల్ప గాయాలతో తృటిలో తప్పించుకున్న కండక్టర్**
- **బస్సులో పోలీసులు, ఉద్యోగులు సహా 72 మంది ప్రయాణికులు**

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై బస్సు కండక్టర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. మీర్జాగూడ వద్దకు బస్సు రాగానే ఏం జరుగుతుందో క్షణంపాటు అర్థం కాలేదని, కన్నుమూసి తెరిచేలోపు ఘోరం జరిగిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్న కండక్టర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మీడియాతో మాట్లాడుతూ, బస్సులో పోలీసులు, ఉద్యోగులు సహా మొత్తం 72 మంది ప్రయాణికులు ఉన్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌బీజాపూర్ జాతీయ రహదారి 163పై మీర్జాగూడ వద్ద ఈ రోజు ఉదయం తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ధాటికి బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దాని కింద కూరుకుపోయారు. ఈ దుర్ఘటనలో వికారాబాద్ జిల్లా యాలాల మండలం హాజీపూర్‌కు చెందిన బండప్ప, లక్ష్మీ దంపతులు మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు భవాని, శివలీల అనాథలయ్యారు. తల్లిదండ్రుల మరణంతో ఆ చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటంతో అక్కడున్న వారి హృదయాలు బరువెక్కాయి.



## ఘోర బస్సు ప్రమాదంపై కేసీఆర్, కేటీఆర్ స్పందన

- **ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొని 24మంది మృతి**
- **మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కేసీఆర్, కేటీఆర్**
- **బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**
- **గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్**

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు మృతి చెందడం పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై కేసీఆర్ స్పందిస్తూ... ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చేవెళ్ల మండలం ఖానాపూర్ స్టేజి వద్ద తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన తీరు కలచివేసిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందడం, అనేక మంది గాయపడటం పట్ల సంతాపం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని, బాధితుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

- **రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం**
- **ఈ దుర్ఘటనలో 24 మంది దుర్మరణం**
- **మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పన పరిహారం**
- **గాయపడిన వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం**
- **ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన**

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం



రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి పరిహారం ప్రకటించింది. ఈ వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. బాధితుల కుటుంబ సభ్యులకు ఇప్పటికే సమాచారం అందించినట్లు చెప్పారు. మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన తర్వాత మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు సకాలంలో అప్పగించేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించామని ఆయన వివరించారు. ప్రభుత్వం అన్ని విధాలా బాధితులకు సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు.


# జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలు

**మెదక్, నవంబర్ 03 (ప్రజా స్వరం) :**



ఈ నెల 3 నుండి 30 వరకు మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ - 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆలయాల నిర్మాణానికి చేయూత



**ములుగు సెప్టెంబర్ 03 ( ప్రజాస్వరం ) :**

మండల కేంద్రమైన ములుగులో పోచమ్మ, ముత్యాలమ్మ దేవాలయాలను నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ ఆలయాల నిర్మాణానికి ములుగుకు చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూతాడి శ్రీనివాస్ విరాళంగా 15 వేలు అందజేశారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాజీద్ పాషా 11 వేలు గుడి నిర్మాణానికి విరాళం అందజేశారు.ఈ కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు కామునికంతల రాములు, తాడెం రమేష్, ఆశగల మల్లేష్, గ్రామ పెద్దలు స్వామయ్య, చంద్రయ్య, నర్సయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా చేప పిల్లల జార విడుత



**శామీర్ పేట నవంబర్ 3(ప్రజస్వరం) :**

పారదర్శకంగా నిర్వహిస్తున్న చేప పిల్లల జారవిడుత కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం సచివాలయం నుండి చేప పిల్లల పంపిణీ కార్యక్రమంపై మంత్రి జిల్లా కలెక్టర్లతో మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతా పార్టీలకతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులతో చేప పిల్లల జారవిడుత కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు. రాష్ట్రమంతటా ఈ నెల 20 తారీకు వరకు ఈ చేప పిల్లల జారవిడుత కార్యక్రమం పూర్తి కావాలని అందుకు జిల్లా మత్స్య శాఖాధికారులతో కలిసి కలెక్టర్లు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. చేప పిల్లల పంపిణీ కార్యక్రమం టి మత్స్య ఆప్ ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. చేపల పెంపకమే కాకుండా ఉత్పత్తి కూడా అత్యంత ప్రాధాన్యమైనదని అన్నారు. వరి సాగులో దేశంలోనే తెలంగాణా ముందున్నట్లుగా చేపల పెంపకం, ఉత్పత్తిలో కూడా ముందుండేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరు చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలలో, జలాశయాల పరిసరాలలో ఫిష్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజన పథకంలో కూడా చేపలు అందించే ఆలోచనలోరాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. చేపల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా చేపల రైతులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖాధికారి సుకీర్తన పాల్గొన్నారు.



# అమ్మవార్ల విగ్రహ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న ఎంపీ ఈటల

**వర్గల్, సెప్టెంబర్ 03 ప్రజాస్వరం :**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండల్ దండుపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మాల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. వారితో పాటు సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్, వర్గల్ మండల్ అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆ అమ్మవారు ప్రజలందరినీ చక్కగా చూడాలని నల్లపోచమ్మ, ముత్యాలమ్మ విగ్రహాలను ప్రతిష్టించుకొని పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి గ్రామంలో బొడ్రాయిని కూడా సీతాలమ్మ తల్లి అని పూజిస్తాం అని చెప్పారు.భారత సాంప్రదాయం చాలా గొప్పదిని, స్త్రీలను గౌరవించడం మాత్రమే కాదు వారే దేవతలుగా పూజించుకుంటాం అన్నారు. మైసమ్మ, ముత్యాలమ్మ, సీతలమ్మ అందరూ తల్లులే మనలని కాపాడుతారాని చెప్పారు.భుమిని కూడా భూతల్లిగా పూజిస్తాము.అమ్మవారి అనుగ్రహం మనందరి మీదా ఉండాలని కోరుకుంటున్నారాని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు శ్రీకాంత్, శంకర్ గౌడ్, యాదగిరి, రాజు, గ్రామస్థులు జంగం రాజు,జంగం యాదగిరి,నర్సింల్లు, కాస మహిపాల్, కాస బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.






# అవినీతిని ఉపేక్షించేది లేదు

- జిల్లాలోనీ అన్ని శాఖలపై ప్రత్యేక దృష్టి
- ప్రజలకు భరోసాగా నిలువాల్సిన బాధ్యత అధికారులది
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, నవంబర్ 03 (ప్రజా స్వరం) :**

ఎవరైనా అధికారులు, వాళ్ల సిబ్బంది అవినీతి మరకలను అంటించుకుంటే సహించేది లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎవరైనా అధికారులు, వాళ్ల సిబ్బంది అవినీతి మరకలను అంటించుకుంటే సహించేది లేదని, అధికారులకు అవినీతి ఆలోచన ఉంటే విరమింప చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. ప్రజల వద్ద నుంచి డబ్బులను తీసుకోవడం చాలా ప్రమాదం అన్నారు. అవినీతి అనేది అతి పెద్ద నేరమన్నారు. అవినీతి అనేది ఒక సర్కిల్ లాగా రోజువారీగా తిరుగుతుందని దానిని అంత మొందించకపోతే అది అందరిని ప్రభావితం చేస్తుందన్నారు. జిల్లాలోనీ అన్ని శాఖలపై తాను ప్రత్యేక దృష్టి సారించానని, ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన, ఏలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న వారిని ఉపేక్షించేది లేదన్నారు. వ్యక్తులు చేసే అనైతిక పనుల వల్ల వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోతుందని, ప్రజలకు భరోసాగా నిలువ వలసిన బాధ్యత అందరి అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఏ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి భుజంగారావు, అధికారులు తదితరులు ఉన్నారు.



# క్షేత్రస్థాయిలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం



- ప్రజల నుంచి 77 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ నవంబర్ 03 (ప్రజా స్వరం) :**

ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే, క్షేత్రస్థాయి లో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొని ప్రజల నుంచి 77 దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో భూభారతి 36, ఇందిరమ్మ ఇండ్లు 7, పెన్షన్లు 7, ఇతర 27 దరఖాస్తులను రావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు బాధ్యత తీసుకుని ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో పెట్టకుండా ప్రతీ దరఖాస్తుకు సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. వేర్వేరు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు, భూ, పింఛన్ల, విద్య, వైద్యం వంటివి సమగ్రమైన పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించలేనప్పుడు కారణాలు, నియమాలు వివరాలతో అర్జీదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డిఆర్ఓ భుజంగరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో
# కాంగ్రెస్ గెలుపు ఖాయం





## మనోహరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి

**మనోహరాబాద్, (ప్రజాస్వరం) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని మనోహరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి సూచనలతో జూబ్లీహిల్స్ లో ఇంటింటి ప్రచారం లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కు సంపూర్ణ మద్దతు లభిస్తుందని దీంతో నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని అర్థమవుతుందన్నారు. నవీన్ యాదవ్ ఇన్ని సంవత్సరాలు ప్రజలకు అందించిన సేవలపై విశేష స్పందన వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో మరింత చైతన్యం పెంచాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపును ప్రత్యర్థి అభ్యర్థులు అడ్డుకోలేరని అన్నారు. సీఎం రేవంత్ కు అనుకూలంగా ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు ఉందని నియోజకవర్గ ఓటర్లే చెప్తున్నారన్నారు. నవీన్ యాదవ్ కుటుంబం ప్రజలకు చేసిన సేవలను నియోజకవర్గ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని ఈసారి ఆయనను గెలిపించి రుణం తీర్చు కుంటామని ప్రజలు తెలుపుతున్నారని విట్టల్ రెడ్డి వివరించారు.



## జాతీయ సేవా సమితి అడ్వెంచర్ శిబిరానికి విద్యార్థి మమత ఎంపిక



**శామీర్‌పేట, నవంబర్ 3 (ప్రజాస్వరం) :**
జాతీయ సేవా సమితి అడ్వెంచర్ శిబిరానికి శామీర్ పేట గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని మమత ఎంపికైయ్యారు. ఈ మేరకు సోమవారం శామీర్ పేట గురుకుల డిగ్రీ మహిళ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మీడియాకు వెల్లడించారు. విద్యార్థిని మమత శామీర్ పేట లోని గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో ఎంఎస్ సీఎస్ గ్రూప్లో మూడో సంవత్సరం చదువుతుంది. ఈ జాతీయ సేవా సమితి అడ్వెంచర్ శిభిరం హిమాచల్ ప్రదేశ్లోని మనాలిలో నవంబర్ 10 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వివరించారు. అడ్వెంచర్ శిభిరం విద్యార్థుల్లో ధైర్యం, నాయకత్వ లక్షణాలు, సామాజికి బాధ్యత అని అన్నారు.

# ఎంపీ రఘునందన్‌ను కలిసిన తూప్రాన్ న్యాయవాదులు

- తూప్రాన్ కోర్టు భవన మరమ్మత్తులకు సహకరించాలని విజ్ఞప్తి
- ఎంపీ లాడ్స్ నుంచి 15 లక్షలు కేటాయిస్తామని హామీచ్చిన ఎంపీ



**మనోహరాబాద్. (ప్రజాస్వరం ) :**
మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ను తూప్రాన్ న్యాయవాదులు సోమవారం కలిశారు. తూప్రాన్ లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కోర్టు భవన మరమ్మతులకు ఎంపీ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తూప్రాన్‌లోని కోర్టు భవనానికి అవసరమైన మరమ్మత్తులపై చర్చించారు. తూప్రాన్‌లోని పాత మండల పరిషత్ కార్యాలయాన్ని కోర్టు భవనంగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో, ఆ భవనానికి కావలసిన మరమ్మత్తుల అంశంపై ఎంపీకి న్యాయవాదులు వివరాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు వెంటనే సానుకూలంగా స్పందించి, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి భవన పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే ఎంపీ లాడ్స్ నిధుల నుండి 15 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎంపీ త్వరలో స్వయంగా తూప్రాన్‌కు వచ్చి కోర్టు భవనాన్ని పరిశీలించి, మరమ్మత్తు పనులకు తన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఎంపీ ని కలిసిన వారిలో న్యాయవాదులు బి శ్రీనివాస్, ఎం అశోక్, జె వేణుగోపాల చారి, జి ఆనంద్, శివకుమార్, అభిషేక్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఆయిల్ పామ్.. ఆదాయం ఫుల్



- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్

**దౌల్తాబాద్ నవంబర్ 3 (ప్రజాస్వరం) :**
దౌల్తాబాద్ మండల రైతులు ఆయిల్ పామ్ సాగుకు విశేష స్పందన చూపుతున్నారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సూచనలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు రైతుల్లో కొత్త ఆశలు నింపుతున్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్ తెలిపారు.మండల కేంద్రంలో మొదటి ఆయిల్ పామ్ పండ్ల కోతవిజయవంతమై, రైతుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై అధికారులు, రైతులు వివరించారు. వ్యవసాయ అధికారుల సమాచారం ప్రకారం, ఒక్క ఎకరా ఆయిల్ పామ్ పంట నుండి 3-4 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్ ధరల ఆధారంగా రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతోంది.

## అనంతగిరిలో కార్తీక మాసం పెద్ద జాతర

**వికారాబాద్, నవంబర్ 3 (ప్రజాస్వరం):**
అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసం పెద్ద జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి తులసి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ ధర్మకర్త ఎన్. పద్మనాభం, అర్చకులు శేషగిరి చార్యులు చేతుల మీదుగా నిర్వహించినట్లు కార్యనిర్వాహణాధికారి నరేందర్ తెలిపారు.



## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**తూప్రాన్ (ప్రజాస్వరం ) :**
రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని మండలంలోని రిటైర్డ్ ఉద్యోగులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని తూప్రాన్ ఉమ్మడి మండలాల ప్రెసిడెంట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం లో చలో హైదరాబాద్ పోస్టర్ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 7న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇందిరాపార్కు వద్ద గల ధర్నా చౌక్ లో భారీ నిరసన దీక్షను చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన దీక్షకు ఉమ్మడి మండలంలోని రిటైర్డ్ ఉద్యోగులంతా తరలివంచి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ బిక్షపతి, మండల ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, సహాయ అధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.




## నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

### గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

**మనోహరాబాద్. (ప్రజాస్వరం ) :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి పిలునిచ్చారు, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రం పూర్తి దశలో అభివృద్ధి చెందుతుందని అయన నన్నారు. . జూబ్లీహిల్స్ లో జరిగే ఉప ఎన్నికలలో భాగంగా నియోజకవర్గంలోని 100 బూత్ లో సోమవారం నవీన్ యాదవ్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యం అవుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ నవీన్ యాదవ్ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ మండలం మాజీ వైస్ ఎంపీపీ ఎంజాల విఠల్ రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, మామిళ్ళ కృష్ణ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## హరీశ్ రావుకు నేతల పరామర్శ

**మనోహరబాద్, (ప్రజాస్వరం ) :**
మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ అకాల మరణం అందరికీ తెలిసిందే. నగరంలోని హరీష్ రావు నివాసానికి మనోహరబాద్ మండలం నుంచి పలువురు నాయకులు సోమవారం తరలి వెళ్లి హరీష్ రావు తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పురం రవి, పరికిబండ మాజీ సర్పంచ్ పూల అర్జున్, జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు రేణు కుమార్ నాయకులు మురళి తదితరులున్నారు.

## తునికిఖల్సా ప్రాథమిక పాఠశాలలో అగ్రి ఎక్స్‌పో

- రేపు కోదండ రెడ్డి వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్, డీఈవో సిద్దిపేట శ్రీనివాస్ రెడ్డి రాక



**వర్గల్, సెప్టెంబర్ 03 ప్రజాస్వరం :**
గత 20, 25 సంవత్సరాల క్రితం తనకు పండిన పంటలో మంచి పంటను వేరు చేసి ఇంటిలో స్టోరేజ్ చేసుకొని అవసరమైనప్పుడు ఆ రైతు ఇంట్లో నుండి విత్తనం తీసుకొని నాటేవారు. అప్పుడు ఏ గ్రామంలో, ఏ రైతు ఇల్లు చూసిన ఒక విత్తన బాండగారమే! కానీ ఇప్పుడు ప్రతి రైతు నుండి విత్తనాలు దూరమై కార్పొరేట్ విత్తన కంపెనీల పైన ఆధారపడి ప్రస్తుతం మన వ్యవసాయ రంగం నడుస్తుందంటే అతిశయోక్తి కాదు. కొన్ని విత్తనాలు కనుమరుగవుతున్నాయి. విత్తనాలు కొనుగోలు భారం కావడం, నకిలీ విత్తనాలతో పంటలు దిగుబడి రాకపోవడంతో రైతులకు పెట్టుబడి ఎక్కువ కావడంతో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు మనం రోజు చూస్తూనే ఉన్నాం. గతంలో పురుగుల మందులు, రసాయనిక ఎరువులు అతి ఎక్కువగా వాడుతూ మనం వ్యవసాయం ప్రకృతి మరియు సేంద్రియ వ్యవసాయం చేసేవాళ్లం. కానీ ఇప్పుడు అతిగా రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడడంతో దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగరు, క్యాన్సర్, కాలేయం, గుండె, కిడ్నీలు, సంతాన సమస్యలతో నేటి యువత వీటి భారినపడుతున్నారు. కాబట్టి వ్యవసాయం, రైతు, విత్తనాల, ఆహార పంటలు, వాణిజ్య పంటలు, కూరగాయల, ఆకుకూరలు, పప్పు దినుసులు ముతక ధాన్యాల పంటల యొక్క ప్రాధాన్యత, రసాయన ఎరువులు, పురుగుల మందులతో వ్యవసాయంతో సమాజం పైన దుష్ప్రభావం విద్యార్థులకు తెలియజేయడం కోసం 150 కి పైగా విత్తనాలు, ఆనాటి నాగలి, ఎడ్లబండి,గోర్రు, ఎడ్లు, బావి, మంచే, గుడిసె, గడ్డివాము, కొడవళ్ళు సేకరించి వాటి ప్రాధాన్యత తెలియజేయడం పాటు, వ్యవసాయం మరియు రైతు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ భవిష్యత్తులో ప్రతి ఇల్లు సీడ్ బౌల్ గా మారాలనే "మన పంట మన ఆరోగ్యం"అనే ఉద్దేశంతో తునికి ఖల్సా ప్రాథమిక పాఠశాల ఆవరణలో "Agri Expo" ను విజయవంతం చేయండి.

## ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**మనోహరబాద్ ( ప్రజాస్వరం ) :**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పోలీస్ స్టేషన్ ఎస్సై సుభాష్ గౌడ్ జన్మదినం సందర్భంగా మండలంలోని పలువు నాయకులు ఆయనకు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నేరాల నియంత్రణ కోసం విధులు నిర్వహిస్తున్న అధికారిగా గుర్తింపు పొందాడని కొనియాడారు. ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులు రేణు కుమార్, పరికి బండ సర్పంచ్ పూల అర్జున్, బీఆర్ఎస్ నాయకులు, మురళి, మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.





# చిరంజీవి ఎనర్జీ వేరే లెవల్

జగపతిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్ము రా' టాక్ షోలో మ్యూజిక్ మిసైల్ దేవిశ్రీ ప్రసాద్ సందడి చేశారు. జగపతి బాబు అడిగిన పలు ప్రశ్నలకు డీఎస్పీ ఆసక్తికర సమాధానాలు చెప్పారు. అలాగే 'అత్తారింటికి దారేది' సినిమాలో 'నిన్ను చూడగానే చిట్టి గుండె' సాంగ్‌ను సరదాగా రోడ్డు మీద నడిచేటప్పుడు రాసినట్లు ఆయన చెప్పారు. తన ఎనర్జీని మ్యాచ్ చేసే హీరో చిరంజీవి అని చెప్పారు. ఆయన ఎనర్జీ మరో లెవల్ అనీ, దాన్ని వర్ణించలేమని అన్నారు దేవి. తన పాటల్లో ఖడ్గంలోని 'నువ్వు నువ్వు' సాంగ్ ఎంతో ఫేమస్ అని, ప్రేమను వ్యక్తపరచడానికి ఆ పాటనే ఎక్కువగా ఉపయోగించు కుంటారని దేవి చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ కావాలని కలలు కన్నప్పటి నుంచి నా పాటకు చిరంజీవి డ్యాన్స్ ఎప్పుడు వేస్తారా అని ఎదురుచూశాను. ఇప్పటికీ చిరంజీవి నా పాటకు డ్యాన్స్ వేస్తే ఆశ్చర్యపోయి చూస్తుంటానన్నాడు. పెళ్లి చేసుకుంటావా? అనే ఆప్షన్ పక్కన ఏది పెట్టినా ఆ ఆప్షన్నే అంగీకరిస్తాను.



# అవార్డుల కన్నా ప్రశంసలే మిన్న

నటీనటులకు అవార్డుల కంటే దర్శకనిర్మాతల ప్రశంసలు గొప్పవని నటుడు పరేశ్ రావల్ చెప్పారు. సినీ పురస్కారాల విషయంలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డుల విషయంలో లాబీయింగ్‌కు ఆస్కారం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇవే పద్ధతులు ఉన్నాయన్నారు.నాకు అవార్డుల గురించి అంతగా తెలియదు. కానీ, నేషనల్ అవార్డుల విషయంలో లాబీయింగ్‌కు ఆస్కారం ఉంటుంది. ఇతర పురస్కారాలతో పోలిస్తే జాతీయ పురస్కారాల విషయంలో లాబీయింగ్ ప్రయత్నాలు ఎక్కువగా ఉంటాయి. ఆస్కార్ అవార్డుల్లోనూ దీనికి ఆస్కారం ఉంది. చిత్రబృందం నెట్‌వర్క్, కొన్ని పార్టీల ద్వారా ప్రయత్నాలు జరుగుతాయి. చిత్రనిర్మాతలు జ్యూరీ సభ్యులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తారు. 'ఇది ఫలనా దర్శకుడి సినిమా' అని ఒక్కోసారి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటారు' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తనకు అవార్డుల కంటే 'నటన బాగుందని' ప్రశంసలు వస్తే ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. బిరుదులు, ట్రోఫీల కంటే దర్శకనిర్మాతల ప్రశంసలే ఎక్కువ విలువైనవని తెలిపారు. ఇక 'వో ఛోకరీ', 'సర్' సినిమాల్లో ఉత్తమ నటనకు గాను పరేశ్ 1994లో ఉత్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు.

# మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో

మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో తెలుసుకోవాలని ఉందని నటి రష్మిక ఆసక్తిని వ్యక్తం చేసింది. రష్మిక కథానాయికగా రూపొందిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. దీక్షిత్‌శెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రష్మిక సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుతం పాన్ ఇండియా ఫిల్మ్స్ చేస్తున్నా. నేరుగా తమిళ మూవీ చేయడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం చాలా వరకూ చర్చల దశలోనే ఉన్నాయి. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చుతుందని భావిస్తున్నా. నాకంటూ కొంతమంది బెస్టీస్ ఉన్నారు. పబ్లిక్‌లో వాళ్ల పేరు చెబితే నన్ను చంపేస్తారని అంటూ సరదాగా కామెంట్ చేశారు. మహేశ్‌బాబులో మీకు నచ్చేది ఏదని అడిగితే.. సర్‌కి ఎప్పటికీ వయసు అయిపోవడం లేదు. పైగా నానాటికీ వయసు తగ్గుతోంది. అది నాకు బాగా ఇష్టం. అదెలా సాధ్యమో నాకు తెలుసుకోవాలని ఉందని చిలిపిగా చెప్పింది. ది గర్ల్‌ఫ్రెండ్, థామా వీటిల్లో ఏ సినిమా చేయటం మీకు అత్యంత కష్టంగా అనిపించిందని అడగ్గా ది గర్ల్‌ఫ్రెండ్ మూవీయే అంటూ తెలిపింది.

# నానికి తల్లిగా సోనాలి కులకర్ణి




సోనాలి కులకర్ణికి జాతీయ స్థాయిలో మంచి పేరుంది. మరాఠీ, హిందీ, గుజరాతీ, తమిళ, ఇంగ్లీష్ చిత్రాలలో నటించిన సోనాలీ కులకర్ణి ఏ పాత్ర చేసినా అందులోకి పరకాయ ప్రవేశం చేస్తుంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' మూవీలో సోనాలి కులకర్ణి కీలక పాత్రను పోషిస్తోంది. నవంబర్ 3 సోనాలి కులకర్ణి పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'ది ప్యారడైజ్' మేకర్స్ ఆమెకు శుభాకాంక్షలు తెలియచేస్తూ ఓ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సినిమా నుండి వచ్చిన 'రా స్టేట్ మెంట్' గ్లింప్స్ కు సోనాలి కులకర్ణి ఇచ్చిన వాయిస్ నూ ఎవ్వరూ అంత తేలికగా మర్చిపోరు. ఓ పెక్యులర్ మాడ్యుల్ లో సోనాలి కులకర్ణి 'రా' గా చెప్పిన డైలాగ్స్ డైనమేట్ మాదిరి పేలాయి. ఆ గ్లింప్స్ లోని వాయిస్ ను వింటే... నాని తల్లి పాత్రను సోనాలి కులకర్ణి చేస్తోందనే విషయం బోధపడుతుంది. ఇందులో ఆమె పాత్ర కూడా అద్భుతంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. చాలామంది సోనాలి కులకర్ణి నటిస్తున్న తొలి తెలుగు సినిమా 'ది ప్యారడైజ్' అనుకుంటారు కానీ ఆమె చాలా కాలం క్రితమే తెలుగులో మోహన్ కోడా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'ఎల్లమ్మ' అనే చిత్రంలో నటించింది. ఆ సినిమాలో నాజర్, రేవతి కీలక పాత్రలు పోషించారు. ఇక 'ది ప్యారడైజ్' విషయానికి వస్తే... ఎస్.ఎల్.వి. సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్న ఈ మూవీలో మరో కీలక పాత్రను విలక్షణ నటుడు మోహన్ బాబు చేస్తున్నాడు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ సినిమా వచ్చే యేడాది మార్చి 26న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999